కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

కార్మిక సంక్షేమ శాఖ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయండి

ప్రజాశక్తి- పుట్టపర్తి రూరల్

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునర్ధరించి,సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న తలపెట్టిన రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ ఎస్ వెంకటేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, జిల్లా అధ్యక్షులు బాబ్జాన్ పిలుపునిచ్చారు. ఆదివారం శ్రీ సత్య సాయి జిల్లా సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయ ముట్టడికి సంబందించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 15 నెలలు అవుతున్న సంక్షేమ బోర్డు విషయం గురించి ప్రస్తావించక పోవటం దారుణమన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కార్మిక శాఖ మంత్రులకు, ఇతరుల మంత్రులకు, ఎమ్మెల్యేలకు, అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా స్పందించకపోవడంతో భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 15వ తేదీన రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడికి పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునర్ధరించి బోర్డులో ఉన్న నిధులను వారి సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల్లోని బోర్డుల్లో నిధులే కాకుండా వార్షిక బడ్జెట్లో అధికంగా నిధులు కేటాయించి కార్మికుల సంక్షేమానికి పాటుపడుతుంటే మన రాష్ట్ర ప్రభుత్వం బోర్డులోని నిధులు నిర్మాణ కార్మికుల కు ఖర్చు చేయకుండా ,ఇతర సంక్షేమ పథకాలకు దారి మళ్లించి కార్మికుల కు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలు నిలుపుదల చేస్తూ 1214 మెమోను తీసుకొచ్చి అన్యాయం చేస్తే రాష్ట్రంలోనే 30 లక్షల మంది నిర్మాణ కార్మికులు ఆ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పారన్నారు. ఈ కూటమి ప్రభుత్వానికి కూడా హెచ్చరిక చేయడానికే సెప్టెంబర్ 15వ తేదీన రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి చేపడుతున్నామన్నారు. జిల్లాలోని కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పెడబల్లి బాబా, కోశాధికారి ముత్యాలు, వర్కింగ్ ప్రెసిడెంట్ కొండా వెంకటేష్, జిల్లా నాయకులు మహమ్మద్, నవీన్, దివాకర్ నాయక్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యామ్నాయం'పై నిర్లక్ష్యం



పెనుకొండ వద్ద దుక్కి చేసి బీడుగా ఉన్న పొలం

జిల్లా వ్యాప్తంగా ఇటీవల విస్తారంగా వర్షాలు కురిసాయి. దీంతో ఖరీఫ్ వేరుశనగ, ఇతర పంటలు సాగు చేయలేని రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు పంపిణీపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ ఏడాది ఖరీఫ్ లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆశించిన స్థాయిలో పంటలు సాగు కాలేదు. దీంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. రైతన్నకు అవసరమైన విత్తనాలు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది.

ప్రజాశక్తి-పెనుకొండ

◆విస్తారమైన వర్షాలతో ప్రత్యామ్నాయ సాగుకు సన్నద్ధం
◆సబ్సిడీ విత్తనాల కోసం రైతుల ఎదురుచూపు
◆అందని సబ్సిడీ విత్తనాలు
◆ఆందోళనలో అన్నదాతలు

ఉమ్మడి జిల్లాలో వర్షాభావం కారణంగా పంటల సాగు తగ్గుతూ వస్తోంది. ఖరీఫ్ లో వేరుశనగ పంట సాగుకు వర్షం కోసం ఎదురుచూసినా పడక పోవడంతో సాగుచేయలేదు. ఇటీవల విస్తారంగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురవడంతో ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధమయ్యారు. నేటికీ రైతులకు విత్తనాలు అందుబాటులోకి రాలేదు. శ్రీసత్యసాయి జిల్లాలో వ్యవసాయశాఖ అధికారులు 60 వేల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు 15వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే నేటికీ ప్రత్యామ్నాయ విత్తనాలు రాలేదు. కొంత మంది రైతులు బయట మార్కెట్లో విత్తనాలు కొనుగోలు చేసి పంట సాగు చేస్తున్నారు. గత ఏడాది వేరుశనగ పంట దెబ్బతినడంతో ఈఏడు పంట సాగు చేసి అప్పుల ఊబినుంచి బయటపడదామని ఆశించిన రైతులకు నిరాశ ఎదురైంది. ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు పడడంతో అధిక వడ్డీకి అప్పులు తెచ్చి వేరుశనగ పంట సాగు కోసం పొలాలను దున్ని దుక్కులు చేసు కుని ఎరువులు, విత్తనాలు అన్ని సమకూర్చుకున్నారు. అయితే వర్షం రాకపోవటంతో తాము పంటసాగు చేయకనే నష్టపోవాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు మొదటివారంలో వర్షాలు పడడంతో కొంత మంది రైతులు వేరుశనగ పంటపై ఆశ చావక వేరుశనగను సాగు చేశారు. కొంత మంది రైతులు మాత్రం ప్రత్యామ్నాయ పంటల సాగుకు సన్నద్ధం అవుతున్నారు. దీంతో గతంకంటే సాగు విస్తీర్ణం బాగా తగ్గింది.

జిల్లాలో వేరుశనగ సాగు ఇలా..

జిల్లాలో మొత్తం సాగు విస్తీర్ణం 2,69,167 హెక్టార్లుఉంది. ఇప్పటి వరకు 42వేల హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేశారు. వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 1,51,824 హెక్టార్లకు గాను ఇప్పటిదాకా 15,897 హెక్టార్లలో సాగైంది. కదిరి డివిజన్లో 96,818 హెక్టార్లు, ధర్మవరం 70,910, మడకశిర 24,015, పెనుకొండ 20,010, హిందూపురం 5,571 హెక్టార్లలో సాగు కావాల్సి ఉంది.

జిల్లా లో80వేల హెక్టార్లలో పంటల సాగు..

వర్షాభావం కారణంగా ఖరీఫ్లో జిల్లాలో 2,69,167 లక్షల హెక్టార్లకుగాను అన్నిరకాల పంటలు కలిపి 80 వేల హెక్టార్లలోనే సాగయ్యాయి. ఇందులో 42వేల హెక్టార్లలోనే వేరుశనగ, మిగతా విస్తీర్ణంలో కంది, మొక్కజొన్న, వరి తదితర పంటలు సాగు చేశారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ఖరీఫ్ లో సాగు విస్తీర్ణం తగ్గిందని అధికారులు అంటున్నారు. అలసంద, ఉలవ, పెసర, జొన్న పంటలు సాగు చేసేందుకు 4,500 క్వింటాళ్ల విత్తనాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

సబ్సిడీ విత్తనాల కోసం ఎదురు చూస్తున్నాం

నాకు 5 ఎకరాల పొలం ఉంది. గతేడాది వర్షాభావం కారణంగా వేరుశనగ పంట దెబ్బతింది. దీంతో నష్టపోయా. ఈఏడాది వేరుశనన సాగు చేసి అప్పులు ఊబిలో నుంచి బయటపడదామని ఆశించి వేరుశనగ సాగుకు పొలాన్ని సిద్ధం చేసుకుంటే వర్షం కురవలేదు. ఆగస్టు నెలలో వర్షాలు పడ్డాయి. దీంతో ప్రత్యామ్నాయ పంటను సాగు చేద్దామనుకున్నా. విత్తనాలు అందుబాటులోకి రాలేదు. దీంతో బయట మార్కెట్ లో మొక్కజొన్న కొనుగోలు చేసి రెండేకరాల్లో పంట సాగు చేశా. రూ.20వేలు ఖర్చుయ్యింది. ప్రభుత్వం ప్రత్యా మ్నాయ విత్తనాలు సరఫరా చేసి ఉంటే ఇంత ఖర్చు అయ్యేది కాదు.

నంజప్ప రైతు ,
అడదాకుల పల్లి

ఉచితంగా విత్తనాలు పంపిణీ చేయాలి

వర్షాభావ పరిస్థితులతో చాలా మంది రైతులు ప్రధాన పంటలు సాగు చేయలేకపోయారు. ఆగస్టులో వర్షం పడటంతో ప్రత్యా మ్నాయ పంటలు సాగు చేసేందుకు రైతులు అసక్తి చూపుతున్నారు. ప్రత్యా మ్నాయ పంటల సాగుకు అనుకూలమైన సమయం ఇదే. దీన్ని దృష్టిలో ఉంచుకొని తక్షణమే ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేయాలి. ఒక్కో రైతుకు ఐదు ఎకరాల వరకూ ఉచితంగా ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేయాలి.

హరి,
ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

నెల క్రితమే ప్రతిపాదనలు పంపాం

జిల్లాలో 60వేల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు 15వేల క్వింటాల్ల ఉలవలు, పెసలు, అలసంద, జొన్న విత్తనాలు అవసరం అవుతాయి. నెల క్రితమే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రత్యామ్నాయ విత్తనాలు వచ్చిన వెంటనే రైతులకు పంపిణీ చేస్తాం.

వై.వి. సుబ్బారావు,
జిల్లా వ్యవసాయశాఖ అధికారి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కూలీలు మృతి
పదిమందికి గాయాలు

ప్రజాశక్తి - కొత్తచెరువు

కుటుంబపోషణ కోసం కూలి పనులకు ఆటోలో వెళుతున్న కూలీల జీవితాలను రోడ్డు ప్రమాదం ఛిద్రం చేసింది. కూలీలను తీసుకువెళుతున్న ఆటోను ఎదురుగా వస్తున్న 407 వాహనం ఢీకొనడంతో ఇద్దరు కూలీలు మృత్యువాత పడగా, మరో పది మంది గాయపడ్డారు. ఈ ప్రమాదం ఆయా నిరుపేద కుటుంబాలను విషాదంలో పడేసింది. మండల పరిధిలోని మైలసముద్రం గ్రామ సమీపంలోనే రోడ్డు మలుపు వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళా కూలీలు మృతిచెందారు. పదిమంది కూలీలు గాయపడ్డారు. కూలీలతో వెళుతున్న ఆటోను 407 వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనకు సంబందించి పోలీసులు తెలిపిన వివరాలు.. బుక్కపట్నం మండలం బుచ్చయ్య గారి పల్లి గ్రామానికి చెందిన కూలీలు చెన్నేకొత్తపల్లి మండలం వెంకటం పల్లి గ్రామానికి వ్యవసాయ పనులకు ఆటోలో వెళుతుండగా కొత్తచెరువు మండలం మైల సముద్రం గ్రామ సమీపంలోనే రోడ్డు మలుపు వద్ద ఎదురుగా వస్తున్న 407 వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 12 మంది కూలీలతో పాటు ఆటో డ్రైవర్‌కు గాయాలు అయ్యాయి. గాయపడ్డ వారిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. వీరిలో మల్లెల లక్ష్మమ్మ (50), వల్లెపు లక్ష్మీనరసమ్మ (70) కొత్తచెరువు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. గంగమ్మ, మీనమ్మ, వెంకటమ్మ, లక్ష్మీదేవి, రాజేశ్వరితో పాటు ఆటో డ్రైవర్ గోపాల్ తీవ్రంగా గాయపడ్డాడు. మృతిచెందిన కూలీలతో పాటు, గాయపడ్డ వారందరూ నిరుపేదలే. కుటుంబపోషణార్థం కూలి పనులకు వెళుతూ ఇలా ప్రమాదానికి గురికావటంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. సంఘటన స్థలాన్ని సిఐ మారుతి శంకర్, పోలీసులు పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లక్ష్మమ్మ (50) ఫైల్‌ఫొటో

లక్ష్మీనరసమ్మ (50) ఫైల్‌ఫొటో

ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

హిందూపురంలో వినాయకుడి విగ్రహ ఊరేగింపు

'పురం'లో ప్రశాంతంగా వినాయక నిమజ్జనం

ప్రజాశక్తి-హిందూపురం

వినాయక చవితి సందర్భంగా ఐదు రోజుల పాటు ప్రతిష్టించిన గణనాధులను ఆదివారం మునిసిపల్ పరిధిలోని డిఆర్ కాలోని, శ్రీకంఠపురం, సడ్లపల్లిలో ఘనంగా నిమజ్జనం చేశారు. సడ్లపల్లి, ఎన్.టి.ఆర్ కాలనీ,బీసీ కాలనీ, ఇండస్ట్రియల్ ఎస్టేట్ సహా పట్టణంలో వివిధ ప్రాంతాల్లో గణనాధులను ప్రత్యేక వాహనాల్లో తీసుకెళ్లి ఊరేగింపుగా నిమజ్జనం చేశారు. రంగురంగుల అలంకరణలతో తీర్చిదిద్దిన ట్రాక్టర్లు, లారీలు, ఆటోలు వీధుల గుండా నిర్వహించిన ఊరేగింపుతో హిందూపురంలో ఉత్సాహ వాతావరణం నెలకొంది. గణనాధుడి విగ్రహాలను గ్రామాల గుండా ఊరేగింపుగా తీసుకువెళ్లారు. సడ్లపల్లిలో జరిగిన నిమజ్జన కార్యక్రమంలో భారీ ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా టూ టౌన్ సీఐ అబ్దుల్ కరీం ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

రాయలసీమ అభివృద్ధిని విస్మరించిన పాలకులు

సాగునీటి కేటాయింపులో అన్యాయం
రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నాయకులు

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి కదిరి టౌన్

రాష్ర జనాభాలో 30 శాతం , భూమి విస్తీర్ణంలో 35 శాతం కలిగి ఉన్న రాయల సీమ ప్రాంత అభివృద్ధిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని సిపిఎం జిల్లా నాయకులు జిఎల్. నరసింహులు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ రమణ జిల్లా అధ్యక్షులు ఆకుతోటపల్లి నారాయణరెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు శ్రీరాములు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేదిక జిల్లా ఉపాధ్యక్షులు యస్ ఇరాన్ అధ్యక్షతన అన్ని రాజకీయ పార్టీలు మరియు ప్రజా సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు జిఎల్ నరసింహులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. తద్వారా ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఫలితంగా రాయల సీమ ప్రాంత ప్రజలు వెనుకబాటుకు గురవుతున్నారన్నారు. రాష్ట్రంలో సాగులో 35 శాతం విస్తీర్ణం భూమి ఉన్న ఇక్కడ సాగుకు నీరు లేక బీడు భూములుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. హంద్రీనీవా కాలవ ద్వారా 1850 ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం తో పాటు నెల్లూరు ప్రకాశం శ్రీకాకుళం లాంటి ప్రాంతాల్లో కూడా చాలా మండలాల్లో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను కూడా పరిష్కరించలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు. ఏపీ అంటే అమరావతి. పోలవరం. హైవే రోడ్లు అంటూ రాష్ట్ర ప్రజల్ని మోసగిస్తున్న ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. అందుకుసంబంధించి అన్ని ప్రాంతాలలో ప్రజలు రైతులు కూడగట్టి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాలని కోరారు. కదిరి ప్రాంతంలో 120చెరువులను నీటితో నింపాలన్నారు. వంద టీఎంసీలు నీళ్లు ఈ ప్రాంతాలకు వచ్చే విధంగా ప్రభుత్వాలు చొరవ చూపాలని డిమాండ్ చేశారు .ఆ దిశగా ప్రభుత్వాలు చొరవ చూపని పక్షంలో వేదిక ద్వారా ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.. ఈ కార్యకమూలో అడ్వకేట్ నరసింహులు, వైసీపీ నాయకులు, లోకేష్ రెడ్డి ,అమర్నాథ్ రెడ్డి , ఆర్ సి పి ఐ డాక్టర్ నాగన్న , సిపిఐ లియకత్ అలీ , కె ప్రసాద్, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏసిడిపిఐ నిర్మల, రెడ్స్ భానుజ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కె.మోహన్‌రామ్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు దాటుతున్నా ఇంకా కొన్ని మారుమూల గిరిజన గ్రామాలు సరైన మౌలిక సదుపాయాలకు నోచుకోలేదు. ప్రధానంగా రహదారులు, తాగునీరు, విద్యుత్, రవాణా సౌకర్యం తదితర మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్న గిరిజన తండాలు, ఎరుకుల, యానాది తదితర వెనుకబడిన గిరిజన ఆవాసాలు ఉన్నాయి. గిరిజన ఆవాసాల అభివద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికంగా కూడా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా గిరిజనులు వారి పిల్లలు పథకాలను అందిపుచ్చుకొని అభివృద్ధి చెందాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న పథకాలు గురించి జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె. మోహన్ రామ్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు. గిరిజనుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకొని అభివద్ధి చెందాలని ఆయన పేర్కొన్నారు.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని గిరిజన ఆవాస గ్రామాలున్నాయి.? అందులో అత్యంత వెనుకబడినవి ఎన్ని?

జవాబు: జిల్లా వ్యాప్తంగా 450 గిరిజన ఆవాస గ్రామాలు ఉన్నాయి. ఇందులో ఏడు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేనట్లుగా గుర్తించాం. రహదారులు, నీటి సదుపాయాలు, కల్పించడానికి తగు చర్యలు తీసుకుంటున్నాము.

ప్ర: గిరిజనులకు కల్పిస్తున్న రుణ సదుపాయాలేవి ?

జ: గిరిజనుల అభివృద్ధి కోసం 60 యూనిట్లు గుర్తించాం. వాటిలో గొర్రెలు, పాడి పశువులు, ట్రాక్టర్లు, బొలెరా వాహనాలు, వీటిని అందించడానికి చర్యలు తీసుకుంటున్నాం. గిరిజన పాఠశాలల అభివృద్ధికి తగిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించాం.

ప్ర: గిరిజన విద్యార్థులు ఎంతమంది ఉన్నారు.? వారికి ప్రత్యేక పాఠశాలలు ఎన్ని ఉన్నాయి.?

జ : జిల్లాలో దాదాపు 1900 మంది గిరిజన విద్యార్థులు ఉన్నారు. వారికోసం ప్రత్యేక పాఠశాలలు ఉన్నాయి. ఒక ఆశ్రమ పాఠశాల, ఆరు గురుకుల పాఠశాలలు, ఐదు వసతిగృహాలు ఉన్నాయి. వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతోంది.

ప్ర: సమగ్ర గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వపరంగా తీసుకుంటున్న చర్యలు ఏమిటి.?

జ : సమగ్ర గిరిజన అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం జిల్లాలో 3 గ్రామాలను ఎంపిక చేసింది. మారుమూల గ్రామాలైన వాటిలో పూర్తిగా మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం. సోమందేపల్లి మండలం నాగినాయుని చెరువు తండా, తనకల్లు మండలంలో ముండ్ల వారి పల్లి, గాండ్లపెంట మండలంలో తుమ్మల జైలు గ్రామాలు ఎంపికయ్యాయి. వీటిని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడమే ధ్యేయం. అందుకు కేంద్ర ప్రభుత్వం తగిన నిధులు మంజూరు చేయనుంది. వాటితో గృహ నిర్మాణం, తాగునీటి సౌకర్యం, రహదారులు, విద్య వైద్య సౌకర్యాలు ఇలా 17 రకాల అభివృద్ధి పనులు, మౌలిక సౌకర్యాలు కల్పిస్తాం. వీటిపై ఆయా శాఖల ద్వారా పర్యవేక్షణ ఉంటుంది. పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో ఆదర్శ గ్రామాలుగా తీర్చించడం జరుగుతుంది.

జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె. మోహన్ రామ్

ప్ర మీశాఖలో సిబ్బంది కొరత ఉందా.? గిరిజనులకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటీ.?

జ : సిబ్బంది కొరత ఏమీ లేదు. అభివృద్ధి పనులు ఆయా శాఖల పర్యవేక్షణలో జరుగుతాయి. తమ శాఖ ఆయా గిరిజన గ్రామాల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతుంది. గతంతో పోల్చుకుంటే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి. మారుతున్న సమాజానికి అనుగుణంగా అవసరాలు కూడా పెరుగుతుంటాయి. గిరిజనులు తమ పిల్లలను బాగా చదివించుకోవాలి. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అందుకొని వాటిని సద్వినియోగం చేసుకొని మరింత అభివద్ధి చెందాలి.

తరలిపోతున్న వృక్ష సంపద..!

◆ యథేచ్ఛగా చెట్ల నరికివేత.. కలప అక్రమ రవాణా

◆ మామూళ్ల మత్తులో అటవీశాఖ అధికారులు

పరిగిలో ప్రధాన రహదారిపై ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న కలప

ప్రజాశక్తి-పరిగి

'చెట్ల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ'.. అలాంటి చెట్లను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత అందరిపై ఉందని ప్రభుత్వం రూ. లక్షలు వెచ్చించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అయితే పరిగి మండలంలో మాత్రం అందుకు భిన్నంగా చెట్లను యథేచ్ఛగా నరికి రోజూ ట్రాక్టర్ల ద్వారా టన్నుల కొద్దీ కలపను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. కలప అక్రమ తరలింపు సంబంధిత అటవీశాఖ అధికారుల ప్రమేయంతో వారి కనుసైగల్లోనే కొనసాగుతుండటం బాధాకరం. రాష్ట్రంలో అటవీ శాఖను బలోపేతం చేయడం, ప్రకృతి సమతుల్యతకు అడవుల పరిరక్షణ ప్రధానంగా భావించి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ శాఖను తీసుకున్నారు. ఇప్పటికే ఆయన ఈ శాఖ ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నా అవి క్షేత్రస్థాయిలో ఫలితాలు ఇవ్వకపోవడం, కొందరు ఉన్నతాధికారులు కూడా క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందన్న విషయాలను క్షుణ్ణంగా తెలుసుకోక పోవడం వల్ల కలప అక్రమ తరలింపునకు బలం చేకూరుస్తోందని చెప్పవచ్చు. రాష్ట్రంలో చెట్ల పరిరక్షణ, అటవీ సంపదను కాపాడేందుకు గ్రామీణ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో కొందరు అటవీశాఖ అధికారులు అవినీతికి పాల్పడుతూ ప్రకృతి సంపదను తమ అక్రమార్జనకు వినియోగించుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాంటి అధికారుల పనితీరు వల్ల పరిగి మండలంలో రోజూ వందల కొద్దీ టన్నుల కలప అధికారుల కనుసన్నల్లో హిందూపురం కట్టెల మార్కెట్‌కు చేరుతోంది. కొందరు అక్రమార్కులు సిండికేట్‌గా మారి కట్టెల మిషన్‌కు అక్రమంగా తరలించే కలపకు అనుగుణంగా రోజూ అటవీశాఖ అధికారులకు మామూళ్లు ముట్టజెబుతున్నట్లు సమాచారం. దీనివల్లే క్షేత్రస్థాయిలో పని చేయాల్సిన అటవీశాఖ అధికారులు హిందూపురం కట్టెల మిషన్ చుట్టూ రోజూ ఉదయం, సాయంత్రం ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరి కొందరైతే ఇష్టారాజ్యంగా చింత, వేప, అటవీ జాతి చెట్లను నరికి స్థానికంగా ఉండే ఇటుక బట్టీలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నా సంబంధిత అధికారులు కనీసం పర్యవేక్షించకపోవడం దుర్మార్గం. చెట్ల నరికివేత, కలప అక్రమ తరలింపు ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో అడవుల్లో పచ్చదనం పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఇకనైనా అటవీశాఖ ఉన్నతాధికారులు స్పందించి మండల పరిధిలో చెట్ల నరికివేతకు అడ్డుకట్ట వేసి అటవీ సంపద, పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రకృతి సంరక్షకులు, పర్యావరణ ప్రేమికులు, మండల ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరుబాటకు సిద్ధం : యుటిఎఫ్

ప్రజాశక్తి-పరిగి

విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యలపై పోరుబాటకు సిద్ధమని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని సేవా మందిర్ జడ్పీ హైస్కూల్ ఆడిటోరియంలో ఆదివారం పరిగి మండలశాఖ ఆధ్వర్యంలో జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమా వేశం నిర్వహించారు. జయచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ బడులను రక్షించుకోవడం, ఉపాధ్యాయ సమస్యలపై ఎప్పటికప్పుడు పరిష్కార దశగా ముందుకెళ్లాల్సిన బాధ్యత యుటిఎఫ్‌పై ఉందన్నారు. ప్రభుత్వాలు ఉపాధ్యాయ డిమాండ్లను పరిష్కరించే దిశగా ఆలోచించడం లేదని, కావున ఉద్యమాలే శరణ్యం అన్నారు. పిఆర్‌సిపై పోరు పేరుతో ఈ నెల 18 నుంచి 22 తేదీ వరకూ మండల స్థాయి నుంచి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించేలా రాష్ట్ర కమిటీ తీర్మానించిందన్నారు. విద్యా విధానాల అమలుపై ప్రచార రథయాత్ర చేపడతామని విజయవంతం చేసేందుకు జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు ముందుకు రావాలన్నారు. ఉపాధ్యాయులపై యాప్స్ భారం తగ్గించాలని, విద్యా బోధనకే పరిమితం చేయాలని, 12వ పిఆర్‌సి కమిటీని నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించి, డిఎలు, ఆర్థిక బకాయిలు చెల్లించాలని, 2003-డీఎస్సీ ఉపాధ్యాయులను పాత పెన్షన్ విధానంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. వివిధ రకాల శిక్షణలు, ఫార్మేటివ్ అసెస్మెంట్ పుస్తకాలను ఉపాధ్యాయులే పూరించాలనడం, ఇతరత్రా కార్యక్రమాలతో మానసిక క్షోభకు గురి చేయడం తగదన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా సమస్యలపై ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకూ మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రధానంగా ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిర్లక్ష్య ధోరణి వీడాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు భూతన్న, సహాధ్యక్షులు బాబు, సీతామాలక్ష్మి, కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు తాహిర్‌వలి, శివశంకర్, నారాయణస్వామి, సుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణ, నరేష్‌కుమార్, క్రిష్టప్ప, లతాదేవి, రామకృష్ణనాయక్, నరసింహప్ప, ఆడిట్ కమిటీ కన్వీనర్ మహంతేశ్వర్, ఎంవి.మారుతి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ చర్చా వేదికగా పరిగిలో మధ్యంతర కౌన్సిల్ తీర్మానం

వేదికపై సంఘీభావం తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

నీఖ్యశ్రీతో అసోసియేషన్ నాయకులు, కోచ్

జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ధర్మవరం విద్యార్థి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పంజాబ్‌లో ఈ నెల 2 నుంచి 9వ తేదీ వరకూ జరిగే 75వ జూనియర్ నేషనల్ బాస్కెట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర బాలికల జట్టుకు పట్టణానికి చెందిన బి.నీఖ్యశ్రీ ఎంపికైందని ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఆగస్టు 14 నుంచి 17వ తేదీ వరకూ పిఠాపురంలో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టులో బి.నీఖ్యశ్రీ పాల్గొంది. ఆ పోటీల్లో నీఖ్యశ్రీ ప్రతిభ చాటి రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. నీఖ్యశ్రీని ధర్మాంబ బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మేడాపురం రామిరెడ్డి, సెక్రటరీ వాయల్పాడు హిదాయతుల్లా, కోచ్ సంజయ్ అభినందించారు. జాతీయ స్థాయిలో కూడా రాణించి తల్లిదండ్రులు, పట్టణానికి పేరు ప్రతిష్టలు తేవాలని వారు ఆకాంక్షించారు.

హైకోర్టు రిటైర్డ్ ఉద్యోగి మృతికి నివాళి

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని బిటి.పల్లి గ్రామానికి చెందిన హైకోర్టు విశ్రాంత ఉద్యోగి, టిడిపి నాయకులు బసవరాజు(71) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి ఆదివారం ఆ గ్రామం వెళ్లి బసవరాజు భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, నాయకులు డాక్టర్ కృష్ణమూర్తి, రాజేంద్ర, గంగాధర్, కరేగౌడ్, క్రిష్టప్ప, భీమరాజు, జయన్న, ఈరన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి 'పల్లె' పరామర్శ

ప్రజాశక్తి-నల్లమడ

మండలంలోని బాసంవారిపల్లికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల హైదరాబాద్‌లో రోడ్డు ప్రమా దంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొంది స్వగ్రామమైన బాసంవారిపల్లిలోని తన ఇంట్లో విశ్రాంతి పొందుతున్నారు. ఈ విషయం తెలియడంతో ఆదివార మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి ఆ గ్రామం వెళ్లి బాసం శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట టిడిపి మండల కన్వీనర్ మైలే శంకర, డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, కోట్లో మంజురెడ్డి, నాగేనాయక్, సలాంఖాన్, అరవింద్‌బాబు, పాపారాయుడు, అబ్బాస్‌ఖాన్, డి.శ్రీనివాసులు, డి.సురేందర్ రెడ్డి, జనార్ధన్, శ్రీనివాసులు, దొడ్డప్ప ఉన్నారు.

శ్రీనివాసరెడ్డిని పరామర్శిస్తున్న పల్లె రఘునాథ్ రెడ్డి

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైంది : పల్లె

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఉపాధ్యాయ వత్తిలో ఉంటూ ఎంతోమందికి విద్యా బుద్ధులు నేర్చి ఉన్నత స్థాయికి చేర్చడంలో పొందే గౌరవం, సంతృప్తి మరే ఇతర రంగంలో దక్కదని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెడబల్లి హైస్కూల్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ పొందగా ఆదివారం అదే పాఠశాలలో హెచ్‌ఎం ఆధ్వర్యంలో సన్మానసభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పల్లె రఘునాథ రెడ్డి, డిఇఒ కార్యాలయ ఎడి వినయ్ కుమార్ హాజరయ్యారు. పల్లె మాట్లాడుతూ వెంకటేశ్వర్లు 36 ఏళ్ల పాటు అంకితభావంతో పని చేసి ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఉపాధ్యాయులు నైతిక విలువలతో కూడిన విద్యనందించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం వెంకటేశ్వర్లు దంపతులను పూల మాలలు, శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పులేరు హెచ్‌ఎం గోపాల్, రిటైర్డ్ ఎంఇఒ ఖలీముల్లా, రిటైర్డ్ హెచ్‌ఎం టివి.మాధవ, రామచంద్రారెడ్డి, ఆదినారాయణరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రసాద్, మస్తాన్, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లు దంపతులను సన్మానిస్తున్న మాజీ మంత్రి పల్లె

సొంత నిధులతో తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యకు సర్పంచి తన సొంత నిధులతో పరిష్కారం చూపాడు. మండలంలోని దంపెట్ల పంచాయతీ పరిధిలోని ఉప్పర్లపల్లి గ్రామానికి చిత్రావతి నది నుంచి నీరు సరఫరా అవుతోంది. అయితే కొంత కాలంగా చెరువు నీరు, వరద నీరు చేరి గ్రామానికి సరఫరా చేసే బోరులో నీరు కలుషితం అవుతోంది. తద్వారా నీరు రంగు మారి వస్తుండడంతో ప్రజలు తాగేందుకు ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని గ్రామస్తులు సర్పంచి చల్లా కరుణాకర్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన ప్రస్తుతం పంచాయతీలో నిధులు లేకపోయినా సమస్యను పరిష్కరిం చేందుకు ముందు కొచ్చారు. తన సొంత నిధులు రూ. 2 లక్షలు వెచ్చిం చి నూతనంగా బోరు వేయించి, కొత్తగా పైపులైన్ వేయిస్తానని హామీ ఇచ్చారు. గ్రాంట్ వచ్చిన తర్వాత పంచాయతీ నిధులు నుంచి వాడుకుంటానన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మాట ఆ ప్రక్రియ అంతా పూర్తి చేసి ఆదివారం ఉప్పరపల్లి గ్రామానికి నూతన బోరు ద్వారా తాగునీరు విడుదల చేశారు. ఇప్పుడు నీరు స్వచ్ఛంగా వస్తుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచికి కృతజ్ఞతలు తెలిపారు.

నూతన పైపులైన్ ఏర్పాటు చేయిస్తున్న సర్పంచి

బుక్కపట్నం బాలుర పాఠశాలకు ప్రతిభా అవార్డు

ప్రజాశక్తి-బుక్కపట్నం

స్థానిక బాలుర ఉన్నత పాఠశాల స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జగదీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. 2024-25 విద్యా సంవత్సరంలో నిర్వహించిన ఆటల పోటీల్లో 23 మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి, ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు. దీంతో తమ పాఠశాలకు 2024-25 విద్యా సంవత్సరానికి స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు దక్కిందని తెలిపారు. 75 ఏళ్ల పాఠశాల చరిత్రలో ఈ అవార్డు రావడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు. ఆగస్టు 29వ తేదీ హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి రోజున క్రీడా దినోత్సవం సందర్భంగా హెచ్‌ఎం జగదీష్, పిడి నాగరాజు జెసి అభిషేక్‌కుమార్ నుంచి ఆ అవార్డు అందుకున్నారు. దీంతో ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామస్తులు, హర్షం వ్యక్తం చేశారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన

ప్రజాశక్తి-రొద్దం

వినాయక చవితి వేడుకల్లో భాగంగా గత శుక్రవారం మండలంలోని సానిపల్లి గ్రామంలో గణేష్ నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఆ సమయంలో ఆ గ్రామానికి చెందిన రెండు సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తులు ఘర్షణ పడ్డారు. అందులో ఓ సామాజిక వర్గానికి చెందిన రామాంజినే యులు మరో సామాజిక వర్గానికి చెందిన మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో వారు శనివారం రొద్దం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు ఫిర్యాదు చేసిన వ్యక్తిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆదివారం ఓ సామాజిక వర్గం ప్రజలు ఉదయం నుంచి స్టేషన్ వద్దకు చేరుకున్నారు. సాయంత్రం 4 గంటలైనా అతడినిక అరెస్టు చేయకపోవడంతో పోలీస్ స్టేషన్ ఎదుట పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు. దీంతో ఎస్ఐ వారికి సర్ది చెప్పారు. అతడిపై శనివారమే కేసు నమోదు చేశామని, పలు గ్రామాల్లో గణేష్ నిమజ్జనం కార్యక్రమంలో తనమునకలై ఉన్నామని, త్వరలోనే అతడిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించి వెనదిరిగారు.

పోలీస్ స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించిన గ్రామస్థులు

రోడ్డు ప్రమాదంలో వ్యాపారవేత్త దుర్మరణం

ప్రజాశక్తి-పెనుకొండ

మండలంలోని గుట్టూరు గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాపారవేత్త మృతి చెందాడు. కియా ఇండస్ట్రియల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాలు.. అనంతపురం నగరంలోని 1వ రోడ్డులో నివాసం ఉంటున్న కిసాన్ కింగ్ ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ ఎండి గొల్ల అంజన్‌కుమార్(34) వ్యాపార నిమిత్తం కారులో బెంగళూరు వెళ్లాడు. అక్కడి నుంచి ఆదివారం ఉదయం అనంతపురానికి తిరుగు పయాణమయ్యాడు. మార్గం మధ్యలో గుట్టూరు గ్రామ సమీపంలోకి రాగానే కారు టైరు పేలి హైవే పక్కన రక్షణగా ఏర్పాటు చేసిన ఇనుప యాంగలర్‌ను వేగంగా ఢీకొన్నాడు. దీంతో ఇనుప యాంగలర్ కారు ముందు భాగం నుంచి దూసుకెళ్లి అంజన్ కుమార్‌ను గుచ్చుకొని కారు వెనుక భాగంలోకి దూసుకెళ్లింది. గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కారు లోపల ఇరుక్కుపోయిన అంజన్‌కుమార్‌ను స్థానికుల సాయంతో బయటకు తీశారు. అయితే తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య రాజ్యలక్ష్మి, ఓ కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదానికి గురైన కారు, అంజన్‌కుమార్(ఫైల్ ఫోటో)

PENUKONDA NAGARA PANCHAYATH

e-PROCUREMENT

Tender Notice.

Sl.No	Tender Notice No.	117/PKD/General Funds & 118/PKD HDPE Pipeline BPS-LRS/E1
1	Scope of Work	E-Autos Repair & HDPE Pipeline
2	No. of Works	2 Nos.
3	Estimate Cost Ranging	Rs. 2.50 Lakhs – 9.00 Lakhs
4	Bid Downloading date	-09-2025 @ 10.30 AM
5	Bid Closing date	-09-2025 @ 5.00 PM

Note: . The details of tender may be seen on e-procurement market Place available @ https://tender.apeprocurement.gov.in

Municipal Commissioner
Penukonda Nagara Panchayath.

నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు

ఎన్‌పి.కుంటలో వినాయక లడ్డు వేలం..

రూ. 84వేలకు దక్కించుకున్న వినయ్

ప్రజాశక్తి-నంబులపూలకుంట

ఎన్‌పి.కుంటలో ఓంకార గణపతి సేవా సమితి ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనం కార్యక్రమాన్ని గ్రామ పెద్దల ఆధ్వర్యంలో కోలాహలంగా నిర్వహించారు. వినాయకుని మండపంలో ఉంచిన లడ్డూ ప్రసాదాన్ని వేలంలో వేయగా రఘునాథ్ కుమారుడు వినయ్ అత్యధికంగా రూ. 84వేలకు దక్కించు కున్నారు. అలాగే నిమజ్జనం వేడుకల్లో భాగంగా మండపం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉట్టిని కొట్టడానికి పలువురు పోటీ పడగా బండారు చెట్లపల్లి టీం పగులగొట్టారు. విజేతలకు రూ. 10,116 అందజేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ వలిబాషా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, స్త్రీ శక్తి పథకం ర్యాలీలో పాల్గొంటారని టిడిపి మండల కన్వీనర్ రామకృష్ణ తెలిపారు. వారు ముందుగా ఉదయం మండలంలోని కొడవగానిపల్లిలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల మొత్తం అందజేస్తారు. ఆ తర్వాత ఇండ్లవెంకటంపల్లి, తలమర్ల, బంగారు చెన్నేపల్లి గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. అలాగే స్త్రీ శక్తి పథకం విజయవంతంపై 10.30 గంటలకు పుట్టపర్తిలో మహిళలతో కలిసి నిర్వహించే ర్యాలీలో పాల్గొంటారని తెలిపారు. ఈ ర్యాలీ తహశీల్దార్ కార్యాలయం నుంచి అన్న క్యాంటీన్, గణేష్ సర్కిల్, పుట్టపర్తి అబ్దుల్ కలాం షాదీమహల్ వరకూ సాగుతుందన్నారు. షాదీ మహల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడతారన్నారు. కావున కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

టిడిపి పంచాయతీ కన్వీనర్‌కు సన్మానం

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని టిడిపి రొద్దం పంచాయతీ కన్వీనర్‌గా రొద్దం గ్రామానికి చెందిన బోయ సామాజిక వర్గానికి చెందిన చిరంజీవిని నియమించిన విషయం తెలిసిందే. దీంతో యూట్యూబ్ ఛానల్ ఎండిలు 99 టివి నరసింహులు, ఎంసిఈ ఛానల్ ఎండి గోపాల్, పెనుకొండ టైమ్స్ న్యూస్ ఛానల్ ఎండి క్రిష్టప్ప, తదితరులు ఆదివారం టిడిపి కార్యాలయంలో చిరంజీవిని పూలమాలలు, శాలువాలతో సన్మానం చేసి అభినందించారు. ఇలాంటి పదవులు మరెన్నో అధిరోహించాలని ఆకాంక్షించారు.

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా రామకృష్ణనాయక్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని మున్సిపల్ పాఠశాల ఉపాధ్యాయలు ఆర్.రామకృష్ణనాయక్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. పరిగి మండలంలోని సేవామందిర్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి యుటిఎఫ సమావేశంలో ఆర్.రామకృష్ణ నాయక్‌ను జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ తెలిపారు. రామకృష్ణ నాయక్ మాట్లాడుతూ మున్సిపల్, అన్ని ప్రభుత్వ యాజమాన్య ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా రాజీ లేని పోరాటం చేస్తామన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన జిల్లా కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం రామకృష్ణనాయక్‌ను జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయ చంద్రారెడ్డి, ధర్మవరం జోన్ నాయకులు లక్ష్మయ్య, అమర్ నారాయణరెడ్డి, సకల చంద్రశేఖర్, సురేష్, రమేశ్, సాయి గణేష్, ఆంజనేయులు, రామాంజనేయులు, రామ్ ప్రసాద్, నాగిరెడ్డి, హరిశంకర్, మేరీ వరకుమారి, లతాదేవి, నాగేంద్రమ్మ అభినందించారు.

రామకృష్ణనాయక్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ క్రికెట్ టోర్నీ.. ఫైనల్స్‌కు చేరిన ఎన్‌పి.కుంట, ధర్మవరం జట్లు

ప్రజాశక్తి-కదిరి టౌన్

సెప్టెంబర్ 5వ తేదీ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కదిరి పట్టణంలో కొన్ని రోజులుగా ఉపాధ్యాయ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఎన్‌పి.కుంట, ధర్మవరం జట్లు ఫైనల్స్‌కు చేరాయి. ఆదివారం నిర్వహించిన మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో ఎన్‌పి.కుంట, తలుపుల జట్లు పోటీ పడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన తలుపుల జట్టు కేవలం 49 పరుగులకు ఆలౌట్ అయింది. తర్వాత బ్యాటింగ్ చేసిన ఎన్‌పి.కుంట జట్టు 7 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. ఆనంద్‌నాయక్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో ముదిగుబ్బ, ధర్మవరం జట్లు తలపడగా ధర్మవరం జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. అంజినాయక్‌కు నాగప్ప, గౌస్‌లాజం, సురేష్, శ్రీనివాసులు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేశారు. ఆర్గనైజర్లుగా శ్రీనివాసులు, మహేందర్‌రెడ్డి, యోగి, అశ్వర్థ, రుద్రంరెడ్డి, రమణ, ముబారక్ వ్యవహరించారు. కార్యక్రమంలో మెంటార్ గంగాధర్‌రెడ్డి, ఎన్‌పి. కుంట జట్టు కెప్టెన్ శ్రీనివాసులు, ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, రామంజులు యాదవ్, రామ్మోహన్, శ్రీనివాసులు, చందు, సందీప్, ఆనంద్‌రెడ్డి, నాగరాజునాయక్ పాల్గొన్నారు.

మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న అతిథులు

క్రీడలతో శారీరక దృఢత్వం

ప్రజాశక్తి-బత్తలపల్లి

ప్రతి ఒక్కరూ క్రీడల్లో సాధన చేయాలని, తద్వారా శారీరక బలం చేకూరుతుందని డిఐడి కోఆర్డినేటర్ రామకృష్ణ సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ఆర్‌డిటి ఆసుపత్రి క్యాంపస్‌లో ఉన్న చిల్డ్రన్ హోమ్స్ విద్యార్థినీ, విద్యార్థులకు ఆగస్టు 29వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఆటల, పోటీలు నిర్వహించారు. ఆదివారం ముందుగా హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామకృష్ణ మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఏటా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహిస్తూ క్రీడల్లో పోటీల్లో నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు. అంతకు ముందు గత మూడు రోజులుగా విద్యార్థులకు ఖోఖో, స్కిప్పింగ్, రన్నింగ్, సైక్లింగ్, ఫుట్‌బాల్, తదితర ఆటల పోటీలను నిర్వహించారు. ఆ పోటీల్లో 21 మంది బాలురు. 22 మంది బాలికలు పాల్గొన్నారు. పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వార్డెన్లు పుష్పలత, ఎల్లప్పు, ఉపాధ్యాయులు సరోజ, గిరిరాజు, తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో ఆర్‌డిటి సిబ్బంది

పాఠశాలలో అసంపూర్తిగా మరుగుదొడ్ల నిర్మాణం

అసంపూర్ణంగా ఉన్న బాత్రూం

ప్రజాశక్తి-నల్లచెరువు

మండలంలోని ఓరువాయి ప్రాథమిక పాఠశాలలో బాత్రూం నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. దీంతో కాలకృత్యాలు తీర్చుకునేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గుంతలో వర్షం నీరు నిల్వ ఉండడం వల్ల పిల్లలు ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. అలాగే దోమలు వృద్ధి చెంది విద్యార్థులు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. ఇకనైనా స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు చొరవ తీసుకొని పాఠశాల ఆవరణలో అసంపూర్తిగా ఉన్న బాత్రూం నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలనిగ్రామస్తులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2010-11 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సుమారు 15 ఏళ్ల తర్వాత ఆదివారం అందరూ ఒక చోట కలవడంతో సంభ్రమాశ్చర్యాలు వ్యక్తం చేశారు. ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ రోజంతా సంతోషంగా సరదాగా గడిపారు. మధ్యాహ్నం విందు భోజనం ఆరగించారు. అప్పటి గురువులు కృష్ణనాయక్, గౌస్‌ఖాన్, రిజ్వానల్లాఖాన్, ఉషారాణి, మధు బాబు, బాల నరసింహులు, నాగరాజు, నీళ్ల శివప్రసాద్, తదితరులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి ఆశీస్సులు పొందారు. పాఠశాల అభివృద్ధికి చేయూతనందించాలని చర్చించు కున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాబాఫకృద్దీన్, అమర్‌నాథ్‌రెడ్డి, అనిత, నాగరత్న, నాగజ్యోతి, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

ఒడిసి జడ్పీ హైస్కూల్‌లో సమావేశమైన 2010-11బ్యాచ్ విద్యార్థులు

ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా పలు పట్టణాలు, గ్రామాల్లో శని, ఆదివారాల్లో చెదురుముదురు సంఘటనలు మినహా ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జన శోభాయాత్రలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు గణేష్ నిమజ్జన ఊరేగింపులో పటిష్ట పోలీస్ భద్రతా చర్యలు చేపట్టారు. ఎక్కడా ఎలాంటి అల్లర్లు, గొడవలు, ఘర్షణలు, అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా డ్రోన్ల ద్వారా నిఘా ఉంచారు. చెరువులు, కుంటలు, నదుల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించి నిమజ్జనం కార్యక్రమాలను పర్యవేక్షించారు. వివిధ శాఖల అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు గజ ఈతగాళ్లు, లైటింగ్, తదితర ఏర్పాట్లతో ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు పోలీసులు తీసుకున్నారు.

నల్లమాడ : స్థానిక ఎస్సీ కాలనీలో పెద్దలు వినాయక యూత్ కమిటీ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఉంచి ఎస్సీ కాలనీ నుంచి మెయిన్ రోడ్ మీదుగా పాతరకుంట చెరువు వరకూ డ్రమ్స్, డ్యాన్సులు, కోలాహలంగా ఊరేగించి క్రేన్ సాయంతో చెరువులో నిమజ్జనం చేశారు.

ధర్మవరం రూరల్ : పట్టణంలో ఆదివారం గణేష్ నిమజ్జన శోభాయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. కేశవ నగర్‌లో చేనేత ఎర్రజోడు లోకేష్, ఎర్రజోడు చంద్ర కలిసి 160 కిలోల గంధం వినా యకుని ఏర్పాటు చేసి పసుపు, కుంకుమ, పండ్లు, గరిక, ప్రీతికరమైన ఉండ్రాళ్లు నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం గంధం వినాయకుడిని ట్రాక్టర్‌లో ఉంచి తేరుబజారు, అంజిమాన్ సర్కిల్, కళాజ్యోతి సర్కిల్, కాలేజ్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, గాంధీనగర్, కదిరి గేట్, శివానగర్ మీదుగా ఊరేగింపుగా తీసుకెళ్లి రోజ్ వాటర్‌ను ఉపయోగించి నిమజ్జనం చేశారు. శారదనగర్‌లో వినాయకుని లడ్డూ ప్రసాదానికి వేలం నిర్వహించగా శంకర్‌నాయక్ దంపతులు రూ. లక్షకు దక్కించుకున్నారు. చంద్రబాబునగర్‌లో ఎల్.బాలునాయక్ రూ. 41వేలకు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు.

నల్లమాడలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర